## కారు ప్రమాదంలో ఒకరు మృతి

రామారెడ్డి (సదాశివనగర్), మే 11: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులోని గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలం కంఠం గ్రామానికి చెందిన నేవి కానిస్టేబుల్ రావుత్ అమూల్ భార్యతో కలిసి కారులో హైదరాబాద్ బయల్దేరాడు. ఈ క్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి బ్రిడ్జిపై కారు అదుపు తప్పి రోడ్డుకు ఉన్న కంచెను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బోయర్ ప్రణీత(19)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. ప్రణీత పరిస్థితి విషమించి మృతిచెందింది. భర్త అమూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

### - ప్రేమ వ్యవహారమే కారణం

లింగంపేట, మే 11: మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన కుచలకంటి సుచరిత (22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. సుచరిత కుటుంబ సభ్యులు బతుకుదెరువు కోసం బోనాల్ గ్రామం నుంచి హైదరాబాద్ నగరానికి వెళ్లారు. గండిమైసమ్మ ప్రాంతంలో ఉంటూ పనులు చేసుకుంటున్నారు. కొంత కాలం క్రితం సుచరిత తల్లిదండ్రులు స్వగ్రామానికి తిరిగి వచ్చారు. కాగా ఆమె మాత్రం ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నది. ఆమె శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. బోనాల్‌లో ఉంటున్న తల్లిదండ్రులకు ఆదివారం ఉదయం సమాచారం అందడంతో వారు హైదరాబాద్ తరలివెళ్లారు. సుచరిత ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామస్తులు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, మే 11: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సైలు ప్రభాకర్, స్రవంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులు అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చింది.. ప్రాసెసింగ్ ఫీజు కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని తెలిపారు. వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరాగాళ్ల ఖాతాలోకి వెళ్తాయని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సైలు సూచించారు.

## అనుమానాస్పదస్థితిలో కూలీ మృతి

లింగంపేట, మే11: కూలీ పనులు చేయడానికి వచ్చిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్సై వెంకట్రావు ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం గ్రామానికి చెందిన అంతోటి ఉపేంద్ర (47) భవన నిర్మాణ పనులు చేయడానికి మండల కేంద్రానికి వచ్చాడు. వెంకటేశ్వరావు మేస్త్రీ వద్ద కూలీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం అతడు మృతి చెందినట్లు గుర్తించిన మేస్త్రీ వెంకటేశ్వర్ రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రఘునాథపాలెంలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మేస్త్రీ వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## నేడు ఐలాపూర్ గ్రామంలో కుస్తీ పోటీలు

లింగంపేట, మే11: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. దుర్గమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా కుస్తీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. చివరి కుస్తీలో గెలుపొందిన వారికి మూడు, రెండు తులాల వెండి కడియాలు బహూకరించనున్నట్లు తెలిపారు.

## 'ఉపాధి' జోరు

### గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్న పనులు

లింగంపేట, మే 11: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. వలసల నివారణ కోసం ప్రారంభించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కూలీలు పనులు చేపడుతున్నారు. బోరు బావుల వద్ద ఫాంపాండ్స్ నిర్మాణం, భూగర్భ జలాల పరిరక్షణ కోసం ఇంకుడు గుంతలు, ఫిష్ పాండ్స్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఫార్మేషన్ రోడ్లు సైతం నిర్మిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిత్యం వంద మందికి పైగా కూలీలు పనులకు హాజరువుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల చెరువుల్లో ఫిష్ పాండ్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి అధికారులు కృషిచేస్తున్నారు. చెరువుల్లో ఫిష్ పాండ్స్ పనులు కొనసాగుతున్నాయని ఎంపీడీవో నరేశ్ ఆదివారం తెలిపారు.



కోమట్‌పల్లిలో చేపడుతున్న ఫిష్‌పాండ్ పనులు

## వివాదాల పరిష్కారానికే కమ్యూనిటీ మీడియా సెంటర్

బాన్సువాడ, మే 11: సమాజంలో తలెత్తే అన్నిరకాల వివాదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు, ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేసేందుకు కమ్యూనిటీ మీడియా సెంటర్ పనిచేస్తుందని కమ్యూనిటీ మీడియా సెంటర్ వలంటీర్ సాయిబాబా తెలిపారు. బాన్సువాడలో ఆదివారం ఆయన మాట్లాడారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ ఆదేశాల మేరకు బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియా సెంటర్‌ను బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి టీఎస్ భార్గవి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి ప్రారంభించారని తెలిపారు. ఎలాంటి వివాదాలు జరిగినా పోలీస్ స్టేషన్, కోర్టులకు వెళ్లకుండా కమ్యూనిటీ మీడియా సెంటర్‌కు వచ్చి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఉచితంగా సత్వర న్యాయం అందించబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వలంటీర్లు పుష్పలత, రామక్రిష్ణారెడ్డి, హుస్సేన్, సంతోష్ పాల్గొన్నారు.



బాన్సువాడలోని కమ్యూనిటీ మీడియా సెంటర్ సభ్యులు

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



కొల్లూర్‌లో లబ్ధిదారుతో డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి సృజన్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, మే 11: ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన ఆదివారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సృజన్‌రెడ్డితో కలిసి ఇండ్లు మంజూరైన వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. ఇండ్లు నిర్మించుకునే వారికి విడుతల వారీగా బిల్లులు మంజూరు అవుతాయని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.ఐదు లక్షలు చెల్లిస్తుందని తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మే 11: పట్టణంలోని 6వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులు ఆదివారం ప్రారంభించారు. వార్డు ప్రజల ఇబ్బందిని గమనించిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు నిధులు మంజూరు చేయించారని నాయకులు తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంతో కాలనీవాసుల మురికి నీటి కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సఖావత్ అలీ, గఫార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

## 'ఉపాధ్యాయుడి కుటుంబానికి అండగా ఉంటాం..'

లింగంపేట, మే 11: గుండెపోటుతో మృతి చెందిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దరావత్ ఈశ్వర్ కుటుంబానికి అండగా ఉంటామని పీఆర్టీయూ టీఎస్ నాయకులు భరోసా ఇచ్చారు. మండలంలోని బాణాపూర్ తండాకు చెందిన ధరావత్ ఈశ్వర్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు ఆదివారం తండాకు వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈశ్వర్ కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రవీంద్ర శర్మ, పీఆర్టీయూ టీఎస్ నాయకులు సురేశ్, పారు, నర్సారెడ్డి, జశ్వంత్‌రావు, విక్రం, శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ



శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మే 11: పాల్వంచ మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ ములుగు జిల్లా వాజేడు సమీపంలో మందు పాతర పేలి మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఆదివారం పరామర్శించారు. శ్రీధర్ మృతి బాధాకరమని విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకునేలా కృషిచేస్తానని చెప్పారు. ఆయనవెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

## ముగిసిన పాలిటెక్నిక్ కోచింగ్



మాట్లాడుతున్న కైరి శశిధర్

కామారెడ్డి, మే 11 : కామారెడ్డిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమాన్ని మంజీరా డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ ఎంతదానో ఉపయోగపడిందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు ప్రత్యూషారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అనిల్ రెడ్డి, కన్వీనర్ రోహిత్, మొగిలి వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో 'శ్రీ శక్తి వరం'



మహిళలకు మార్గ నిర్దేశం చేస్తున్న ప్రణయ దాసాజీ

కామారెడ్డి, మే 11: కామారెడ్డిలోని కల్కినగర్‌లో ఉన్న శ్రీ పరంజ్యోతి కల్కి భగవతి భగవానుల ఆలయంలో ఆదివారం మహిళల కోసం ప్రత్యేకంగా స్త్రీ శక్తి వరం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు ప్రణయ దాసాజీ మార్గ నిర్దేశం చేశారు. మహిళలో దాగిన శక్తిని జాగృత పరిచి మహిళలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, బాంధవ్యాల సఖ్యత, సౌభాగ్యం సవాళ్లను ఎదుర్కోవడంలో నిర్ణయాలను తీసుకునే శక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. మహిళల్లో అంతర్గత శక్తి దాగి ఉన్నదని, దానిని ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు.

## యువకులు శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



కన్‌కల్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బీబీపాటిల్

లింగంపేట, మే 11: యువకులు శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జహీరాబాద్ పార్లమెంట్ మాజీ సభ్యుడు బీబీ పాటిల్ సూచించారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని రక్షించిన చక్రవర్తి ఛత్రపతి అని కొనియాడారు. కార్యక్రమంలో గాంధారి మాజీ జడ్పీటీసీ తానాజీరావు, డాక్టర్ మర్రి రాంరెడ్డి, ఆంబీర్ మనోహర్‌రావు, హరిస్మరణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శివాజీరావు, రాజేశ్వర్ రావు, ముకుందరావు, ఆనంద్‌రావు, సాయిరెడ్డి, కిష్టారెడ్డి, రాంచందర్‌రావుతో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ నాటక ప్రదర్శన



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

నస్రుల్లాబాద్, మే 11: బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం నల్ల పోచమ్మ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు ప్రదర్శిస్తామని గ్రామస్తులు తెలిపారు. నాటకంలోని శంకరుడు, పార్వతి, దక్ష మహారాజు, నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ, లక్ష్మీదేవి పాత్రలు ఆకట్టుకున్నాయి. నాటకాన్ని గ్రామంలోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

## వానాకాలం సాగుకు సమాయత్తం

యాసంగి పంటలు పూర్తికావడంతో వానకాలం పంట సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. వరి కోతలు పూర్తి అయి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులు ముందస్తుగా వానకాలం పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. దుక్కి దున్ని నారు మళ్లను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద బోర్లం, జక్కల్‌దాని తండా, ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్, తిర్మలాపూర్, కొత్తాబాది, మొగులాన్‌పల్లి తదితర గ్రామాల రైతులు భూమి దున్నే పనుల్లో బిజీగా ఉన్నారు.

*- బాన్సువాడ రూరల్, మే 11*



బోర్లం శివారులో దుక్కి దున్నుతున్న రైతు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



రేపల్లెవాడలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు



గాంధారిలో..

ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి, మే 11: ఎల్లారెడ్డి మండలంలోని రేపల్లెవాడలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం పంపిణీ చేసినట్లు గ్రామ మాజీ సర్పంచ్ దుద్దుల సాయిరాం తెలిపారు. గ్రామానికి చెందిన కురుమ భాగ్యలక్ష్మికి రూ.60వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు నాయకులు పిట్ల యాదయ్య, బెస్త సాలవ్వ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని చత్రునాయక్ తండాకు చెందిన రావ్యాకు రూ.30వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వినోద్‌గౌడ్, అజ్మీరా గోవింద్‌నాయక్, నాగం శ్రీనివాస్, సిద్దు, శంకర్, మహేశ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. వెల్లుట్ల గ్రామానికి చెందిన ఆరుగురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. మొత్తం రూ.లక్షా 95వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మరి భాస్కర్, రాజయ్య, రవి, సాయిలు, గౌతం తదితరులు పాల్గొన్నారు. గాంధారిలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో బాధితులకు పంపిణీ చేశారు. సీతాయిపల్లికి చెందిన నారాయణకు రూ.56వేలు, సిద్దుకు రూ.60వేలు, శాంతవ్వకు రూ.21,500, నాగభూషణానికి రూ.17వేల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు రాజమల్లు, సాయిబాబా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దామరంచలో ఉచిత వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

నస్రుల్లాబాద్, మే 11: బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బాన్సువాడ సెవెన్ హిల్స్ దవాఖాన, బోధన్ లయన్స్ క్లబ్, బిగ్ టీవీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★నేను మొహమ్మద్ ఫజాలుద్దీన్ తండ్రి మొహమ్మద్ ఫక్రుద్దీన్ ని॥ ఇ.నెం.2-11, కోర్పోల్ గ్రామము, మం॥ లింగంపేట్, జి॥ కామారెడ్డి, నా యొక్క పాస్‌పోర్ట్ నెం.M9074174 తేది: 04.03.2025 రోజున నా యొక్క పాస్‌పోర్ట్ నా గ్రామమైన కార్పోల్‌లో ఇంట్లో వెతికి చూడగా ఎక్కడ కనబడుటలేదు. కావున నా యొక్క పాస్‌పోర్ట్ ఎంక్వైరీ చేసి ఇప్పించగలరని మనవి.

NTZ-338619

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అమర జవాన్‌కు అశ్రునివాళి

కంఠేశ్వర్, మే 11: సారంగాపూర్ శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమర జవాన్ మురళి నాయక్‌కు అశ్రునయనాలతో నివాళులర్పించారు. దేశం కోసం యుద్ధంలో పోరాడుతూ ఆయన వీరమరణం పొందడం బాధాకరమని యువత భావోద్వేగతం చెందారు.

**సారంగాపూర్ హనుమాన్ ఆలయంలో పూజలు**

సారంగాపూర్, మే 11: మండలంలోని సారంగాపూర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద పూజలు నిర్వహించారు. ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమణం పొందిన భారత సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని, దేశ సైనికులందరూ ఆయురాగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పాల్గొన్నారు.




అమరజవాన్‌కు నివాళులర్పిస్తున్న యువకులు

## సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో ఫ్రెండ్లీ వాలీబాల్ మ్యాచ్‌లు



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

రాజంపేట్, మే 11: మండలంలోని తలమడ్ల జడ్పీహెచ్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్ కొనసాగుతున్నది. ఈ సందర్భంగా తాడ్వాయి, తలమడ్ల గ్రామాలకు చెందిన అండర్ 14, 17 విభాగాల్లో క్రీడాకారులకు ఆదివారం ఫ్రెండ్లీ వాలీబాల్ మ్యాచులు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ వాలీబాల్ కోచ్ బాలు మాట్లాడుతూ.. క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో నేర్చుకున్న మెళకువలతో క్రీడలో మరింత రాణించాలన్నారు. కార్యక్రమంలో తాడ్వాయి పీడీ సంగారెడ్డి, తాడ్వాయి, తలమడ్ల సీనియర్ క్రీడాకారులు స్వామి, సాయికుమార్, బాబాగౌడ్, సృజన్, శ్రవణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల ఘర్షణ

వర్ని, మే 11: మండల కేంద్రంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వర్ని మండల కేంద్రంలో అంతాపూర్, తగిలేపల్లి గ్రామాలకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొనగా ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. వారి మధ్య మాటామాట పెరిగి రెండు గ్రామాల ప్రజల ఘర్షణకు దారితీసింది. సుమారు గంటన్నర గంటల పాటు గొడవ కొనసాగింది. 100కు, పోలీసులకు ఫోన్ చేసినా స్పందించలేదని స్థానికులు మండిపడ్డారు. మండల కేంద్రంలో సుమారు 200 మంది రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒక్రు దాడి చేసుకున్నా పోలీసులు స్పందించలేదని స్థానికులు తెలిపారు.



గొడవ పడుతున్న యువకులు

## చిన్ననాటి మిత్రుడికి ఆర్థిక సాహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్వామి మిత్రులు

రాజంపేట్, మే 11: మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన పుట్టకొక్కుల స్వామి కొన్ని రోజుల క్రితం జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న అతడితో చదివిన 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు రూ.43వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ మిత్రుడు గాయపడిన విషయం తెలుసుకొని తమవంతు సహాయం చేశామని చెప్పారు. బాధితుడు స్వామి వారికి కృతజ్ఞతలు తెలిపారు.